క్లుప్తంగా

ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న జెడ్పీటీసీ

ముస్తాబాద్: వేసవిలో మండుతున్న ఎండల నుంచి ఉపాధిహామీ కూలీలు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని జెడ్పీటీసీ గుండం నర్సయ్య కోరారు. రామలక్ష్మణపల్లెలో 90 మంది ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధిహామీ కూలీల కోసం ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకుందన్నారు. ఉదయమే ఉపాధి పనుల్లో చేరి పది గంటల వరకు ఇళ్లకి వెళ్లాలన్నారు. ఎండలు మండుతున్న సమయంలో ఆరోగ్యాలను చూసుకోవాలన్నారు. ఫీడర్ చానల్ పనులను బాగా చేస్తున్నారని కొనియాడారు. సర్పంచ్ దమ్మ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, టీఏ రమేశ్, పంచాయతీ కార్యదర్శి కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

వేములవాడ: జూన్ 4 నుంచి కొత్తగూడెంలో జరిగే సీపీఐ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు కడారి రాములు మంగళవారం విడుదల చేశారు. కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున బహిరంగ సభకు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాజు, గాజుల పోచెట్టి, పెంట శీను, పెంట మల్లయ్య, గాజుల దేవయ్య, గాజుల మల్లేశం, ఆరెల్లి మల్లేశం పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



బోనాలు సమర్పిస్తున్న గౌడ కులస్తులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు నెత్తిన బోనాలెత్తుకుని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కులస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి సుస్తీ

- వైద్యాధికారితోపాటు సీహెచ్‌వో ఖాళీలు
- మొదటి ఏఎన్ఎమ్ లేక వెలవెల
- శిథిలావస్థలో భవనం
- తగ్గిన నార్మల్ డెలివరీలు



పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న స్టాఫ్‌నర్స్

ముస్తాబాద్: ఇరవై నాలుగు గంటల వైద్య సేవలందించే పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీలు రోగులపాలిట శాపంగా మారాయి. లక్ష మంది జనాభాకు వైద్య సేవలందించాల్సిన ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు తగ్గాయి. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నప్పటికీ పలు విభాగాల్లో ఖాళీలు ఇబ్బందిగా మారాయి.

ఇన్‌చార్జిలతోనే వైద్య సేవలు

ఈ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సంజీవ్‌రెడ్డి పోస్టు గ్రాడ్యుయేషన్ విద్య అభ్యసించేందుకు వెళ్లడంతో, ఎల్లారెడ్డిపేట వైద్యాధికారికి అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఆయన కూడా బదిలీ కావడంతో ఇక్కడ కాంట్రాక్టు వైద్యాధికారిగా గీతాంజలి సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా ఉపవైద్యాధికారిగా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. డ్రాఫ్టింగ్ అధికారం లేకపోవడంతో డాక్టర్ గీతాంజలి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. మండలంలో తొమ్మిది ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఏఎన్ఎమ్‌లు ఉన్నారు. మొదటి ఏఎన్ఎమ్ పోస్టులు ఏడు ఖాళీగా వున్నాయి.

ఇవీ ఖాళీలు..

ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు రెగ్యులర్ వైద్యులు ఉండాలి. 24 గంటలు వైద్య సేవలు అందించాల్సిన కేంద్రంలో ఒక కాంట్రాక్టు వైద్యాధికారి ఉన్నారు. ఫార్మసిస్టు ఇంద్రసేనారెడ్డి వీఆర్ఎస్ తీసుకోవడంతో, 104 ఫార్మసిస్టు నరేందర్ ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మహిళా సీహెచ్‌వో పోస్టు ఏళ్లుగా ఖాళీగా వుంది. ఎల్‌టీ ప్రవీణ్ సైతం కాంట్రాక్టుపైనే పనిచేస్తున్నారు. తెర్లుమద్ది, బందనకల్, ఆవునూర్, చీకోడు, నామాపూర్, మద్దికుంట, పోతుగల్ సబ్‌సెంటర్లలో మొదటి ఏఎన్ఎమ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక డ్రైవర్, సబార్డినేట్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అలాగే మరో స్టాఫ్‌నర్స్ పోస్టు కావాల్సి వుంది. నిత్యం 90 నుంచి వందమంది వరకు ఓపీ ఉంటున్న ఆరోగ్య కేంద్రంలో మరిన్ని రెగ్యులర్ పోస్టులను భర్తీ చేస్తే ఓపీ 150 వరకు ఉంటుంది. పలు పోస్టులు ఖాళీగా వుండడంతో ఎన్‌సీడీ సర్వేలో ఆలస్యం అవుతోందని అధికారులు అంటున్నారు. అలాగే ఏడాది క్రితం వరకు ఆరోగ్య కేంద్రంలో నెలలో పది వరకు ప్రసవాలు జరిగేవి. ప్రస్తుతం కొద్ది నెలలుగా కాన్పులు చేయడం లేదు. అధికారులు, ఉద్యోగులు బదిలీ కావడం, కొన్ని పోస్టులు ఖాళీగా వుండడంతో కాన్పులు చేయడం లేదని, జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయడం జరుగుతోందని సిబ్బంది అంటున్నారు.

ఎంఎల్‌హెచ్‌పీతో వైద్య సేవలు

ప్రభుత్వం పల్లె దవాఖానాలను ప్రారంభించడంతో మండలంలోని సబ్ సెంటర్లలో మిడిల్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించింది. నిజానికి పల్లె దవాఖానాల్లో ఒక వైద్యాధికారి ఉండాల్సి వున్నప్పటికి, వాటిలో పనిచేసేందుకు వైద్యులు విముఖత చూపారు. దీంతో ఎమ్ఎల్‌హెచ్‌పీలను ప్రభుత్వం నియమించింది. అన్ని రకాల వైద్య సేవలను ఇక్కడ అందించాల్సి వుంది.

60 ఏళ్ల భవనం

ఉమ్మడి జిల్లాలోనే పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చాలా ప్రముఖమైంది. 1964లో ఇక్కడ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఆసుపత్రి శిథిలావస్థకు చేరడంతో, మంత్రి కేటీఆర్ రూ.1.45 కోట్ల వ్యయంతో నూతన ఆసుపత్రి భవన నిర్మాణాన్ని చేపట్టారు. రాబోవు రోజుల్లో 30 పడకల ఆసుపత్రి మంజూరయ్యే అవకాశాలు ఉండడంతో ప్రస్తుతం నిర్మిస్తున్న భవనం వృథాకాకుండా దానికి అనుగుణంగానే నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నారు. పీహెచ్‌సీ పాత భవనం పలు చోట్ల పగుళ్లు బారింది. ఎంతోమంది వైద్యులు ఇక్కడ పనిచేసి లక్షలాది మందికి వైద్య సేవలను అందించారు. వైద్యాధికారి క్వార్టర్లు కూడా ఇటీవలే మరమ్మతు చేయించారు.

పేరు నిలబెడతాం



ఈ ఆరోగ్య కేంద్రానికి మంచి పేరు ఉంది. సిబ్బంది కొరతతో సేవలు కొంతమందికి అందడం లేదు. ఎన్‌సీడీ సర్వే కూడా ఈనెలాఖరులోగా పూర్తి చేస్తాం. కంటి వెలుగు శిబిరాలు మరో మూడు రోజుల్లో ముగుస్తాయి. అందరికి అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తాం.

– యాదగిరి, హెచ్ఈవో

అధికారులకు నివేదించాం



ఖాళీగా వున్న పోస్టులపై అధికారులకు నివేదించాం. సిబ్బంది బాగా పనిచేసేలా ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నాం. గర్భిణులకు ప్రతి వారంలో రెండు రోజులు పరీక్షలు చేస్తున్నాం. ఏఎన్ఎమ్‌ల కొరత ఉంది. ప్రసవాలు జరిగేలా చూస్తున్నాం. సమస్యలున్న వారిని జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నాం.

– డాక్టర్ గీతాంజలి

30 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలి



ముస్తాబాద్ మండలానికి 30 పడకల ఆసుపత్రిని మంత్రి మంజూరు చేయాలి. 22 గ్రామాలకు ఒకే ఆరోగ్య కేంద్రం ఉంది. మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్య సేవలను విస్తరించాలి. ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయాలి. ప్రసవాల సంఖ్య పెంచాలి. సామాన్యులకు సర్కార్ వైద్యం అందేలా అధికారులు చూడాలి.

– స్వేచ్ఛ, ఎంపీటీసీ, ముస్తాబాద్

పవర్ కట్

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి: మండలంలోని టెక్స్‌టైల్ పార్కు 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బద్దెనపల్లి, సారంపల్లి, పద్మనగర్, ఇందిరమ్మకాలనీ, కేసీఆర్‌నగర్, మండెపల్లి గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నియామకం

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ప్రశాంత్

తంగళ్లపల్లి: మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎగుర్ల ప్రశాంత్‌ను నియమిస్తూ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డిమల్ల భాను తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి తీర్మానం



మాట్లాడుతున్న మహేందర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ హనుమాన్ ఆలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు గొరిశెట్టి మహేందర్ ఆధ్యక్షతన ఆలయ రెనోవేషన్ కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయలు కల్పిస్తామన్నారు. ఆలయం ఎదుట వాహన పూజల కోసం ఆఫ్‌రౌండ్ రేకుల షెడ్డు నిర్మాణం, ఆలయం ముందు భాగం ఆర్చి గేటు నిర్మాణం, ఆలయం చుట్టూ సీసీ రోడ్డు ఏర్పాటు, కల్యాణ మండపం, ప్రహరీ నిర్మాణం చేయడానికి తీర్మానించినట్లు తెలిపారు. దేవాదాయశాఖ సీజీఎఫ్ నిధులు, భక్తుల విరాళాలతో ఈ పనులు చేపట్టేందుకు దేవాదాయశాఖ ఇంజినీరింగ్ అధికారులతో ప్లాన్, ఎస్టిమేషన్‌ను వేయించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మారుతి, కమిటీ సభ్యులు ఆరె సత్యనారయణ, మేర్గు జల, పర్వతీ భూమేశ్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ఎనర్జీ డ్రింక్ పంపిణీ



ఎనర్జీ డ్రింక్స్ అందిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

సిరిసిల్లఅర్బన్: బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో ఆర్టీసీ కార్మికులకు ఎనర్జీ డ్రింక్‌ని ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ మంగళవారం పంపిణీ చేశారు. పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్, ఇల్లందుల ప్రకాశ్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని..



చందుర్తి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో వీవోఏలు మంగళవారం మోకాళ్లపై కూర్చొని నిరసనను వ్యక్తం చేశారు. 18 రోజులుగా నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్న ప్రభుత్వం స్పందించక పోవడంపై విమర్శించారు. ఈ కార్యక్రమంలో వీవోఏల జిల్లా అధ్యక్షురాలు బుక్యా రజిత, మండల అధ్యక్షురాలు స్వరూప, మండల ప్రధాన కార్యదర్శి వినోద, మమత, పద్మ, గంగ, మంజుల, రమ, రమ్య పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



కోనరావుపేటలో..



తంగళ్లపల్లిలో..

గంభీరావుపేట/కోనరావుపేట/తంగళ్లపల్లి/వీర్నపల్లి/బోయినపల్లి/చందుర్తి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రాల్లో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, దయాకర్‌రావు చిత్రపటాలకు జేపీఎస్‌లతో పాటు టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ వంగ కరుణ, పడిగెల మానస, పర్లపల్లి వేణుగోపాల్, సెస్ డైరెక్టర్లు గౌరినేని నారాయణరావు, కొట్టిపెల్లి సుధాకర్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఎంపీడీవోలు శ్రీనివాస్, నల్లా రాజేందర్ రెడ్డి, రవీందర్, ఎంపీవోలు రాజశేఖర్, గంగాతిలక్, ప్రదీప్‌కుమార్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, మండల అధ్యక్షుడు వల్లకొండ వేణుగోపాలరావు, జేపీఎస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కులు అందించడంలో జాప్యం



సీఎంఆర్ఎఫ్ చెక్కు

వేములవాడ: చేతికందిన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయకుండా నాయకులు జాప్యం చేయడంతో, గడువు దాటిన చెక్కులతో లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రులపాలై రూ.లక్షలు ఖర్చు పెట్టుకున్న సీఎంఆర్ఎఫ్ కోసం ఎమ్మెల్యే రమేశ్‌బాబు ద్వారా దరఖాస్తు చేసుకున్న చాలా మందికి ఇటీవల చెక్కులు మంజూరయ్యాయి. అయితే ఆ చెక్కులు ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు చేరవేయాల్సిన నాయకులు తమ వద్దనే ఉంచుకొని కాలాయాపన చేయడంతో మంగళవారంతో వాటి గడువు ముగిసింది. చెక్కులతో బ్యాంక్ వారిని సంప్రదించగా, బ్రాంచ్‌ల ద్వారా లెటర్లు తీసుకుని మరోసారి చెక్కులపై తేదీలు మార్చుకుని రావాలని వారు సూచిస్తున్నారు. లబ్ధిదారుల్లో చాలామంది నిరక్షరాస్యులు కావడంతో ఆందోళన చెందుతున్నారు. మూడు మాసాల క్రితం మంజూరైన చెక్కులు లబ్ధిదారులకు చేరవేయకుండా నాయకుల నిర్వాకం వారికి ఇబ్బందులను తెచ్చిపెట్టింది. ఇప్పటికైనా నాయకులు తమ స్వలాభం కోసం చూడకుండా లబ్ధిదారులకు సకాలంలో చెక్కులు అందేలా చూడాలంటూ వేడుకుంటున్నారు.

కంటి వెలుగు ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరానగర్ భరత్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం నేరెళ్ల పీహెచ్‌సీ మెడికల్ అధికారి జిందం రేఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ల నాగరాజు, ఎంపీటీసీ గుగ్గిళ్ల లావణ్య, జూనియర్ కార్యదర్శి లక్ష్మీ, మెడికల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని మొర్రాపూర్ తండాలో కంటి వెలుగు శిబిరాన్ని వైద్యాధికారి గీతాంజలి మంగళవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు, అద్దాలు, మందులు అందజేస్తామన్నారు. సర్పంచ్ దేవేందర్, హెచ్ఈవో యాదగిరి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలంలోని అడ్డబోర్ తండా గ్రామంలో మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా కంటి వైద్యులు గ్రామ ప్రజలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులు, కంటి అద్దాలు అందజేశారు.

అ'పూర్వ' సమ్మేళనం



రుద్రంగి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1996-97 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం రెడ్డి ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సన్మానించారు.

మూత్రశాలకు తలుపు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



కోనరావుపేట: మండలం నిమ్మపల్లిలోని బస్టాండ్‌లో ఉన్న మూత్రశాలకు తలుపును ఏర్పాటు చేశారు. ×మూత్రశాలకు వెళ్లేదెలా?₹ అన్న శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించారు. కార్యదర్శి అనిల్ పంచాయతీ ఆవరణలో ఉన్న మూత్రశాలను పరిశీలించి తలుపును ఏర్పాటు చేయించారు. గ్రామపంచాయతీ వద్ద ఉన్న మూత్రశాల వినియోగంలోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

స్టోర్ రూమ్ కాదు.. ఈవో కార్యాలయం మెట్లు



వేములవాడ: ఈ ఫొటో చూస్తే ఏదో స్టోర్ రూమ్‌లా ఉంది కదూ.. కానీ ఇది స్టోర్ రూమ్ కాదు. ఇది రాజన్న ఆలయ ఈవో కార్యాలయానికి వెళ్లే మెట్లు. మెట్లకు పక్కనే చెక్కలతో నింపేయడంతో ఇలా స్టోర్ రూమ్‌లా కనిపిస్తోంది. ఆలయ అధికార యంత్రాంగం యావత్తు ఈ మెట్లపై నుంచే కార్యాలయాలకు వెళుతుంటారు. ఇలా స్టోర్ రూమ్‌గా మారడాన్ని ఎవరూ ప్రశ్నించడంలేదంటూ సిబ్బంది గుసగుసలాడుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



మద్దికుంటలో రైతులను సన్మానిస్తున్న అధికారులు

ముస్తాబాద్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. ముస్తాబాద్ మండలం మద్దికుంట రైతువేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. మద్దికుంటలో సాగు చేస్తున్న మెట్టు రామశర్మ, జనగామ గోపాల్‌రావును అధికారులు సన్మానించారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, వ్యవసాయాధికారి వెంకటేశ్, సూపర్‌వైజర్ స్రవంతి, ఉపసర్పంచ్ భూమయ్య, సతీశ్ పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ రైతువేదిక భవనంలో ఉద్యానవన అధికారి గోవర్ధన్, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అవగాహన కల్పించారు. ఎంఏవో ప్రణీత, ఏఈవో రజిత, ఆర్బీఎస్ అధ్యక్షుడు సంతు ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని రైతువేదికలో ఏఈవో అర్చన అవగాహన కల్పించారు. అనంతరం వల్లంపట్ల క్లస్టర్ పరిధిలో సాగు చేసిన రైతులను సన్మానించారు. సర్పంచ్ అనసూయ, ఎంపీటీసీ స్రవంతి పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలం బావుసాయిపేట రైతువేదికలో ఏవో వెంకట్రామమ్మ అవగాహన కల్పించారు. ఉపసర్పంచ్ దేవరాజు, రైతు సంఘం నాయకులు తిరుపతియాదవ్, హార్టికల్చర్ క్లస్టర్ అధికారి అరవింద్, ఏఈవో స్రవంతి, రైతుబంధు సమితి కోఆర్డినేటర్లు, బావుసాయిపేట రైతులు పాల్గొన్నారు.

మహిళ భద్రత కోసమే షీటీమ్స్



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రేమ్‌దీప్

వీర్నపల్లి: మహిళ భద్రత కోసమే ప్రభుత్వం షీటీమ్‌లను ఏర్పాటు చేసిందని ఎస్సై ప్రేమ్‌దీప్ అన్నారు. మండల కేంద్రంలో షీటీమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వేదింపులు, ఈవ్ టీజింగ్ గురయ్యే మహిళలు, యువతులు, విద్యార్థులు షీటీంలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని జవారిపేట, నర్సక్కపేట గ్రామాల్లో జరుగుతున్న ఇంకుడు గుంతల నిర్మాణం పనులను మంగళవారం ఏపీవో చంద్రయ్య పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలందరూ ఇంటింటికీ ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలని సూచించారు.

పూడికతీత పనులు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: సింగ సముద్రం కాలువల పూడికతీత పనులను ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, ఎంపీటీసీ అనసూయ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, నర్సింలు, లింగం, బాబు, అఫ్జల్, కార్యదర్శి దేవరాజు, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్లో ఇంటర్ సీఈసీ విభాగంలో 970 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తిమ్మనగరం మేఘనను మంగళవారం సిరిసిల్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ బండి దేవదాస్, వైస్ చైర్మన్ రమణా రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజన్న, నాయకులు సంతోష్ పాల్గొన్నారు.

పరిశుభ్రత, పౌష్టికాహారంతో డయేరియా నివారణ

సిరిసిల్లటౌన్: పరిశుభ్రత, పౌష్టికాహారంతో డయేరియా నివారించవచ్చని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మహేశ్ అన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పీహెచ్‌సీలోని పర్యవేక్షకులకు డయేరియా నివారణ కార్యక్రమం గురించి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి వచ్చే నెల 8 వరకు డయేరియా నివారణ పక్షోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్, జింక్, విటమిన్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. డయేరియా నివారణ గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సంపత్, మహేశ్, బాలయ్య పాల్గొన్నారు.